క్లుప్తంగా

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారావు

పరవాడ: పెదముషిడివాడ శివారు గండివాని పాలెంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య గ్రంథాలయాన్ని గ్రామ ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా అప్పారావు(కబడ్డీ) పిలుపునిచ్చారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య గ్రంథాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. నిర్వహణకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, గ్రామ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, పార్టీ కన్వీనర్ నందవరపు శ్రీను, గ్రామ పెద్దలు కె.చిన్నారావు, ఎం.అర్జునరావు, బొబ్బరి శ్రీను, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీ ఆవిష్కరణ



కరాటే చాంపియన్ షిప్ ట్రోఫీ ఆవిష్కరిస్తున్న సుమన్

పరవాడ: వచ్చేనెల 14న వాడచీపురుపల్లి శ్రీరామచంద్రమ్మ పండగ పురస్కరించుకొని 13వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలను ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన ట్రోఫీని నగరానికి విచ్చేసిన సినీ నటుడు సుమన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, గ్రాండ్ మాస్టర్ నూకరాజు, కోచ్ గొర్లి పుష్పారావు, సతీష్, శివగణేష్, శ్రీను పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసుల నమోదు

- ఒక వాహనం సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

గోపాలపట్నం: ఫ్యాన్సీనంబర్లపై రవాణా శాఖ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసులు నమోదు చేశారు. ఒక వాహనాన్ని సీజ్ చేశారు. ప్రత్యేక బృందాలు బోయపాలెం, ఎస్ఎస్‌టీఎల్, మద్దిలపాలెం, గాజువాక, ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని ఉరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

సీతంపేట: గత మూడు నాలుగు దశాబ్దాలుగా ఆర్థిక అసమానత, ఆర్థిక అస్థిరత, మానవ-ప్రకృతి పరస్పర చర్యలు పెరిగాయని ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు వకులాభరణం వంశీ అన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'మార్క్స్ పెట్టుబడి గ్రంథం సమకాలీన ప్రాసంగికత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారం కోసం పెట్టుబడిదారీ వ్యతిరేక రాజకీయ ఎజెండా తప్పనిసరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్పత్తి సాధనాల యజమానులు కార్మికుల అదనపు విలువలను కాజేస్తున్నారని విమర్శించారు. వ్యక్తిగత సంపద అసమానత స్థాయిల్లో చిన్నదైన కానీ గుర్తించదగిన పెరుగుదలతోపాటు వాస్తవంగా అన్ని సమూహాల్లో దేశంలో సంపదల స్థాయిలు పెరిగాయన్నారు. కార్ల్‌మార్క్స్ రాసిన గ్రంథం చదవడం ద్వారా అనేక అంశాలను అవగతం చేసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎస్.అంజయ్య, మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జె.వి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు సీహెచ్.రాఘవేంద్రరావు, సీపీఐ కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



సుజాతానగర్‌లోని ఆలయంలో పాయసం సిద్ధం చేస్తున్న భక్తులు



గోశాలలో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



చినముషిడివాడలోని సూర్యనారాయణస్వామి

భానుడికి.. ప్రణమిల్లి

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు

సింహాచలం: రథ సప్తమి పూజలు శనివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. భక్తులు సూర్య భగవానుడిని భక్తితో కొలిచారు. పలు ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.

➡ జీవీఎంసీ 97వవార్డు సుజాతానగర్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, అర్చనలు విశేషంగా నిర్వహించారు. భక్తులు, మహిళలు స్వయంగా కర్రలపొయ్యిపై వండిన పాయసాన్ని స్వామికి నివేదించారు. ఆలయ ప్రాంగణంలో ఆదిత్య హృదయ పారాయణ, సూర్యనమస్కారాలు విశేషంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ చినముషిడివాడలోని సూర్యయజ్ఞ వల్క పీఠంలో రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి అర్చకులు పూజలు చేసి అరుణపారాయణ నిర్వహించారు. సూర్యభగవాడిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివ్చారు.

గోశాలకు పోటెత్తిన భక్తులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో పన్నెండు అడుగుల సప్త అశ్వ వాహన సూర్యనారాయణస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సూర్యనమస్కారాలు, అరుణపారాయణం పఠించారు. కాగా ఇక్కడ హోమం నిర్వహిస్తామని దేవస్థానం అధికారులు ముందుగా ప్రకటించినా చేయకపోవడంతో భక్తులు నిరాశ వ్యక్తం చేశారు.

సింహగిరిపై...

సింహగిరిపై కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని సూర్యనారాయణస్వామి సన్నిధికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని తరించారు.

నేడు భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం



సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవం ఆదివారం నిర్వహించేందుకు శ్రీ భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. మండలం రోజులకు (41 రోజులకు) ఒకసారి వచ్చే ఆదివారం ఈ అధివాస మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఒక్కో అధివాసంలో ఒక్కో పత్రితో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఈ వారం వాకుడు(బృహతి) పత్రితో పూజ నిర్వహించనున్నారు. ముందుగా వేదపండితుల మంత్రోచ్చరణలతో అమ్మవారికి మంగళస్నానాలు చేయించి, దివ్య పంచామృతాలతో అభిషేకించి,కర్పూరాది సుగంధి,గంధాదులతో అమ్మవారిని అలంకరిస్తారు. అదేవిధంగా అమ్మవారి సన్నిధిలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

కమిషనర్ దృష్టికి సమస్యలు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ కమిషనర్ రాజాబాబును శనివారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నగరంలోని జీవీఎంసీ కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని జీవీఎంసీ వార్డుల్లో చేయాల్సిన పలు అభివృద్ధి పనుల విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయనకు పలు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 93,94,97 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దాసరి రాజు, ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్ పాల్గొన్నారు.

30న 'ఉక్కు ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తామని మోదీ ప్రకటించి ఈ నెల 27 నాటికి రెండేళ్లు పూర్తయింది. రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు కొనసాగుతున్నాయి. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం.. లేదా మూసేస్తామని ప్రకటిస్తున్న నేపథ్యంలో మోదీ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ఉక్కునగరం సెక్టార్-5లో గల త్రిష్నాగ్రౌండ్స్‌లో ఉక్కు ప్రజాగర్జన భారీ సభ నిర్వహించనున్నట్టు అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో ప్రజాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు అన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందన్నారు. గత రెండేళ్లుగా పెద్ద ఎత్తున పోరాటాలు, నిరసనలు, ఆందోళనలు చివరకు రాష్ట్ర బంద్ నిర్వహించినా ప్రభుత్వ నిర్ణయంలో మార్పు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏకగ్రీవంగా స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేసినా కేంద్ర ప్రభుత్వం వైఖరిలో మార్పు రాలేదన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం. జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, మంత్రి రాజశేఖర్, ఎం. మన్మథరావు, వై. మస్తానప్ప, దొమ్మేటి అప్పారావు, కనకారావు, గండి నాయనబాబు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి సేవ చేయండి



చైతన్య సదస్సులో పాల్గొన్న పాలిటెక్నిక్ విద్యార్థులు



మాట్లాడుతున్న రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి

మురళీనగర్: దేశం కోసం మనం ఏమి చేయగలమని విద్యార్థులు ఆలోచించాలని రిటైర్డ్ వైస్ అడ్మిరల్ రమన్ పూరి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే దేశంపై ప్రేమ, త్యాగం అనే ముఖ్యమైన గుణాలను అలవరచుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే భారతీయులు అత్యంత మేధోశక్తి గల వారన్నారు. ఎవరి శక్తిపై వారికి సంపూర్ణమైన నమ్మకం కలిగి ఉన్నప్పుడు అనుకున్నది సాధించగలరని చెప్పారు. విద్యార్థులు మంచి విలువలు, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తయారు కావాలని, అందుకు అధ్యాపకులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ భారత్‌లో పాల్గొని దేశానికి సేవ చేయాలని రమన్ పూరి పిలుపునిచ్చారు. ఇన్నోవేషన్ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. తెలివైన, మేధావులైన విద్యార్థులు ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్ల దేశానికి నష్టం కలుగుతుందని వివరించారు. స్వదేశీ సాంకేతిక అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు విశిష్టమైనవని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ జీవనానికి నిర్ణయాలు తీసుకోవడంలో చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో 800 మంది విద్యార్థులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీల కుల గణన చేపట్టాలి



జీవీఎల్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘ నేతలు

మద్దిలపాలెం: ఓబీసీల కుల గణన వెంటనే చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసరావు కోరారు. జీవీఎల్‌ను శనివారం కలిసి వినతిపత్రాన్ని అందించామని చెప్పారు. కేవలం రాజకీయం పోరాటం ద్వారానే బీసీ సాధికారత సాధ్యమవుతుందని ఈ సందర్భంగా జీవీఎల్ పేర్కొన్నారని వారు తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు దామాషా విధానాన్ని అనుసరించి సీట్లు కేటాయించడ లేదని అన్నారు. బీసీల సంక్షేమానికి, వారి రాజకీయ ప్రాధాన్యానికి తగిన న్యాయం చేయాలని ఎంపీని కోరామన్నారు. మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ద్వారక శ్రీను, గోపి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఘన స్వాగతం

సింహాచలం: శారదాపీఠం వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు శనివారం విచ్చేసిన తమిళనాడు రాష్ట్ర గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్, రాష్ట్ర డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజాకు పీఠం వద్ద పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, 93, 97వవార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దాసరి రాజు, మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం .. కమనీయం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: రథ సప్తమి పురస్కరించుకుని శనివారం సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని రాతిరథంపై స్వామివారి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఏడాదిలో రథ సప్తమి రోజు మాత్రమే రాతిరథంపై స్వామివారి నిత్యకల్యాణం నిర్వహించడం పరిపాటి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ,సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి, అప్పాజీ తదితరులు కల్యాణం నిర్వహించారు. రథంపై స్వామివారి కల్యాణం తిలకించి ఉభయదాతలు, భక్తులు పరవశించారు.

మర్యాద పూర్వక కలయిక



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ రాజు

పరవాడ: నగరానికి విచ్చేసిన డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తున్నారని డీజీపీకి అభినందనలు తెలిపారు.

'గ్రూప్-1 మెయిన్స్ అర్హత పెంపుపై హర్షం'

ఎంవీపీకాలనీ: గ్రూప్-1 అభ్యర్థుల అర్హత పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో గ్రూప్-1 మెయిన్స్‌కు 1:20 నిష్పత్తిలో అభ్యర్థులను ఏపీపీఎస్సీ మెయిన్‌కు ఎంపిక చేసేదన్నారు. పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఉద్యోగ అవకాశం కోల్పోతున్న నేపథ్యంలో ఆ నిష్పత్తిని 1:50కి (మెయిన్స్ రాతపరీక్షలో ఒక ఉద్యోగానికి 50 మంది పోటీలో ఉండేలా) పెంచాలని చాలా కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను 1:50 నిష్పత్తిలో మెయిన్‌కు అవకాశం కల్పిస్తూ ఏపీపీఎస్సీ నిర్ణయం ప్రకటించడంపై అభినందనలు తెలియజేశారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి రోజా



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న మంత్రి రోజా



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న విజయ్‌కుమార్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో నరసింహరాజు అందజేశారు. రోజా వెంట ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఉన్నారు.

దర్శించుకున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ విజయ్‌కుమార్

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జి.విజయ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ఘనంగా అక్కాలమ్మ పేరంటాలు తీర్థం



అక్కాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెంలో అక్కాలమ్మ తీర్థమహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు పేరంటాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కాలమ్మ జాతరను గ్రామంలోని జక్కానవారి కుటుంబాల ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్య హరిశ్చంద్ర పౌరానిక నాటక ప్రదర్శన, బాలనాగమ్మ బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఫార్మాసిటీలో భద్రత ప్రమాణాలు పాటించాలి



సింహాద్రి కూడలిలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో భద్రత ప్రమాణాలు అమలు చేస్తూ కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సింహాద్రి కూడలిలో కార్మికులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఫార్మాసిటీలో ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలపై అధికారులు నిర్వహించిన ఆడిట్ నివేదిక బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలను యాజమాన్యాలు గోప్యంగా ఉంచడం వల్ల కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు భద్రత ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.అప్పారావు, ఎస్.నాగప్పారావు, దొడ్డి అప్పారావు, తాతారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కుష్టువ్యాధిపై అవగాహన

మహారాణిపేట : జాతిపిత మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 13 వరకు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జిల్లా లెప్రసీ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పాఠశాల, కాలేజీ విద్యార్థులు పాల్గొని కుష్టువ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు. చర్మంపై ఎర్రని రాగి రంగు స్పర్శ లేని మచ్చలు, శరీరం, ముఖంపై బొడిపెలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, చేతి వేళ్ల వంగిపోవడం, కాళ్లు, పాదాలు వాలిపోవడం, కళ్లు మూత పడకపోవడం వంటివి కుష్టువ్యాధి లక్షణాలని తెలిపారు. అలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు ఆశ లేదా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందాలని అన్నారు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అంగవైకల్యం గల వారికి ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్స చేయించి అదనంగా 8 వేల రూపాయిలు పారితోషికం అందిస్తుందని డాక్టర్ పూర్ణేంద్రబాబు తెలిపారు. కుష్టువ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు ఉచితంగా శిక్షణ అందజేసి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.